

వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న పంటలు


# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 1, ఏప్రిల్ 2026






చెన్నూరు మండలంలో..

# అకాల వర్షం..
# అన్నదాతకు అపార నష్టం

✶ గాలి వానకు నేలరాలిన మామిడికాయలు, వరి పంటలు..

✶ మంచిర్యాలలో నేలమట్టమైన విద్యుత్ స్తంభాలు



మంచిర్యాల: విరిగిపడిన విద్యుత్ స్తంభం

– ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో,
మార్చి 31, ప్రభాతవార్త

వివరాలు 2లో..



తాండూర్ మండలంలో నేలరాలిన మామిడికాయలు



హాజీపూర్: నేలవాలిన వరి పంట

## రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాలను నివారించండి

✪ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

✪ 230 మంది ఆటో, టాక్సీ, లారీ, కార్ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

ఉట్నూర్, మార్చి 31,ప్రభాత వార్త :

జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్ర డిజిపి డి శివధర్ రెడ్డి చే ప్రారంభించబడిన అరైవ్ అలైవ్ కార్యక్రమం సందర్భంగా మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని హెచ్కేజీఎన్ గార్డెన్‌లో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ, లారీ, కార్ డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మిగతా 2లో..





## బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

● గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు

● ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

● దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

నిర్మల్, మార్చి 31, ప్రభాతవార్త:

బాసర సరస్వతీ క్షేత్రాన్ని దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. ఏప్రిల్ 6న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బాసర పర్యటనకు రానున్న నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన ఏర్పాట్లను సమీక్షించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో శంకుస్థాపనలు చేయనున్న ప్రాంతాలను, మిగతా 2లో..

## గ్రామ, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలి

✻ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

నస్పూర్, మార్చి 31, ప్రభాతవార్త



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామసభలు, వార్డు సభలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులతో మిగతా 2లో..



## రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాలను నివారించండి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డిఫెన్సివ్ డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ వాహన నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల లో ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మంచి కంటి చూపుతో ప్రమాదాల నివారణ సాధ్యం అని తెలిపారు. ఆటోలలో ఇలాంటి అసంఘిక కార్యకలాపాలు చేయవద్దని, డ్రైవర్లకు ఎలాంటి అనుమానం ఉన్న వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం చేరవేయాలని తెలిపారు. ఈ ఉచిత కంటి పరీక్ష లో బోథ్ చెందిన 230 మంది ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లు పాల్గొన్నట్లు తెలిపారు. వీరందరికీ నిష్ణాతుడైన కంటి వైద్యులు డాక్టర్ సంధ్య పుష్కర్ ఆప్తమాలజీ, వైద్య పరీక్షలను నిర్వహించినట్లు, జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పరీక్షలను పరిశీలించి, నిరుపేద 30 మంది డ్రైవర్లకు ఉచితంగా కంటి అద్దాలను ఇచ్చారు. శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నవారికి ఆదిలాబాద్ పట్టణంలో ఉచితంగా వైద్య సేవలు అందించనునట్లు తెలిపారు. ముఖ్యంగా ఆటోలలో టాక్సీలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, గంజాయి మాదకద్ర వ్యాలు లాంటి వాటివి తరలకుండా, నిషేధిత పదార్థాలను, వస్తువులను, వాటిని రవాణా చేయకుండా ఉండాలని తెలిపారు. డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, ఎస్ఐ జి విజయ్, ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ సాయన్న, నార్నూర్ ఎస్సై శ్రీ సాయి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీసు డాక్టర్ శాంతరాజ్, ఆటో డ్రైవర్లు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి పనుల నిర్మాణ స్థలాలను వారు పరిశీలించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బాసర క్షేత్ర చారిత్రక ప్రాశస్త్యాన్ని కాపాడుతూ, భక్తులకు సకల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల కోసం బాసరలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పాత పుష్కర ఘాట్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, నూతన ఘాట్లను నిర్మిస్తామన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే మౌలిక సదుపాయాల పనులను ప్రారంభించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించామని, సమన్వయంతో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర పాల్గొన్నారు.

## గ్రామ, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించే గ్రామసభలు/వార్డు సభల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రణాళిక ప్రకారం గ్రామసభలు/వార్డు సభలు నిర్వహించాలని, ఈ సభలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. గ్రామసభలు/వార్డు సభలు మొదటగా తెలంగాణ గీతంతో ప్రారంభించి, సంబంధిత సర్పంచులు, కౌన్సిలర్లు/కార్పొరేటర్ల ప్రారంభ ఉపన్యాసం తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించాలని తెలిపారు. గ్రామసభలు/వార్డు సభలలో సంబంధిత గ్రామ/వార్డు ప్రజలకి రాష్ట్ర ప్రభుత్వ అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతు భరోసా, గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ తదితర రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు చదివి వినిపించాలని తెలిపారు. అర్హులైన వారికి పథకాలను అందించేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. సభలలో ప్రజలతో మాట్లాడించాలని, గ్రామసభల కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభించే ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం, ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు అల్పాహార పథకం, మధ్యాహ్న భోజన పథకాలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి జిల్లాలో కళాకారులు అందుబాటులో ఉన్నారని, వారి ద్వారా ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఇకపై మ్యానువల్ టోకెన్ల జారీ ఉండదని, ఏప్రిల్ 1వ తేదీ నుండి ఇసుక రవాణాను ఆన్ లైన్ ద్వారా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు/వార్డు సభల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని, సంబంధిత ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా సభలు నిర్వహించే ప్రాంతాలలో ఫ్లెక్సీలు/బ్యానర్లు ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశం కొరకు ఆడియో సిస్టం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక ఏర్పాట్లు, త్రాగునీరు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. గ్రామసభలు/వార్డు సభలలో స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం.. అన్నదాతకు అపార నష్టం



**తాండూర్, మార్చి 31, ప్రభాతవార్త**

మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం అర్ధరాత్రి ఈదురుగాలులతో వడగళ్ల వాన కురిసింది. వడగల్లు, ఈదురు గాలులతో వర్షం పడడంతో రాత్రి పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచింది. చేతికొచ్చిన మామిడికాయలు నేల రాలడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల మామిడి పంటలు దెబ్బ తినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు సర్వే చేసి దెబ్బతిన్న పంటలకు అంచనాలు వేసి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**నస్పూర్, మార్చి 31, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిన్న రాత్రి కురిసిన అకాల వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. 7వ డివిజన్‌లోని స్పెషల్ డి క్వార్టర్ పోస్టాఫీసు లైన్‌లో భారీ వృక్షం విద్యుత్ తీగలపై విరిగిపడింది. ఈ ప్రభావంతో నాలుగు విద్యుత్ స్తంభాలు ఒక్కసారిగా నేలమట్టమయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే మేయర్ దర్ని మధుకర్, కార్పొరేటర్ వేల్పుల రవీందర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించిన మేయర్.. తక్షణమే విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో ఆ ప్రాంతంలో సరఫరా నిలిచిపోయింది. మేయర్ ఆదేశాలతో స్పందించిన సింగరేణి విద్యుత్ అధికారులు రంగంలోకి దిగారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, సింగరేణి విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**జన్నారం, మార్చి 31, ప్రభాతవార్త**

నిన్న రాత్రి కురిసిన అకాల వర్షం రైతన్నలకు అపార నష్టాన్ని మిగిల్చింది. ఎంతో కష్టపడి, చెమటోడ్చి పండించిన పంటలు, మామిడి, నిమ్మ తోటలు చేతికొచ్చే సమయంలో ఈ అకాల వర్షం రైతన్నలకు ఎంతో నష్టాన్ని కలిగించిందని వాపోయారు. జన్నారం మండలంలోని వివిధ గ్రామాలలో కురిసిన అకాల వర్షాలకు మామిడి,నిమ్మ తోటల రైతులు నష్టపోయారు.సోమవారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటలకు ఉరుములు, మెరుపులు భారీ ఈదురుగాలలతో గంటకు పైగా వర్షం నమోదయింది. దీంతో జన్నారం మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన కౌలు రైతులు ఉప్పు గంగన్న,ఒడ్డెటి నారాయణ, ఒడ్డేటి సురేష్ తాము 30 ఎకరాలలో వేసిన మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే దేవునిగూడెం కామన్ పల్లి,ఇందనపల్లి గ్రామాలలో మామిడి తోటల్లో మామిడికాయలు నేల రాలడంతో భారీ నష్టం వాటిల్లింది.ఇంధనపల్లి గ్రామంలో వంగపల్లి రాజన్న కు చెందిన మామడి తోటలో ఈదురు గాలులకు మామిడికాయలు మొత్తం నెలకొరిగి సుమారు రెండు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల నిమ్మ చెట్లు పడిపోవడంతో భారీ నష్టం వచ్చిందని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.తమను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు కోరారు.

**చెన్నూరు, మార్చి 31, ప్రభాతవార్త**

అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం అన్నదాతలను కుదేలు చేసింది. పంట చేతికి వచ్చే సమయానికి చేయి జారి పోయేలా చేసి, రైతులను నట్టేట ముంచింది. మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం రాత్రి కురిసిన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం మామిడి రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. ఈ అకాల వర్షం ప్రభావంతో చెన్నూర్, భీమారం, జైపూర్, కోటపల్లి మండలాల్లో వందల ఎకరాల్లో ఉన్న మామిడి తోటల్లో కాయలు నేలరాలిపోయాయి. కొన్నిచోట్ల వరి పంట నేలకొరిగింది. ప్రతి ఏడాది వేసవిలో పంట చేతికి వచ్చే కీలక సమయంలో ఇలాంటి ఈదురు గాలులు, వర్షాలు రావడం వల్ల భారీ నష్టాలు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ఖర్చుతో సాగు చేసిన పంట చివరి దశలో నష్టపోవడం తమకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను తెచ్చిపెడుతోందని రైతులు తెలిపారు. జిల్లాలో ఇతర పంటలతో పాటు మామిడి సాగు కూడా విస్తృతంగా జరుగుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేయాలని, సంబంధిత అధికారులతో సర్వే నిర్వహించి బాధిత రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**హాజీపూర్, మార్చి 31, ప్రభాతవార్త**

సోమవారం రోజు రాత్రి కురిసిన భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పంటలకు అపార నష్టం జరిగింది.అకాల వర్షం, గాలి, ఉరుములు వల్ల రైతులకు తీవ్ర నష్టం జరిగింది. పంటలకు జరిగిన నష్టం మండలంలో వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. మామిడి కాయలు నేలరాలాయి. పూలు, చిన్న పండ్లు రాలిపోయాయి. కూరగాయలు నీటిలో మునిగి పాడయ్యాయి. వర్షంతో పాటు,బలమైన గాలులతో పంటలు పడిపోయాయి. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

**సారంగాపూర్, మార్చి 31, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఈ అకాల వర్షంతో చేతికొచ్చిన యాసంగి పంటలు నేలపాలై అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ఇప్పటికే వేల ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులు, ఇప్పుడు కోత దశలో ఉన్న పంట కూడా వడగండ్ల వానకు దెబ్బతినడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల వరుసగా నష్టపోతున్న తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నేలకొరిగిన పంటను చూసి రైతులు కన్నీటిపర్యంతమయ్యారు.

**దిలావర్పూర్, మార్చి 31, ప్రభాతవార్త:**

దిలావర్పూర్ మండలంలో అర్ధరాత్రి ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. కోతకు సిద్ధంగా ఉన్న జొన్న, మొక్కజొన్న పంటలు పూర్తిగా నేలమట్టం కావడంతో అన్నదాతలు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రకృతి ప్రకోపానికి మామిడి పూత, కాయలు రాలిపోయి రైతులకు నిరాశ మిగిలింది. మండలంలోని కాల్వ, సిర్గాపూర్, గుండంపల్లి, బండ్రపల్లి, కంజర్ గ్రామాల్లో పంట నష్టం తీవ్రంగా ఉంది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి విస్తరణ అధికారులతో కలిసి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. జరిగిన నష్టంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని ఆయన తెలిపారు.



# మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

*** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, మార్చి 31, ప్రభాతవార్త**

రాష్ట్రంలోని మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, ఆర్‌టిసి మంచిర్యాల డిపో మేనేజర్, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధి అనితలతో కలిసి ఎపిఎంలు, డిపిఎంలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో మహాలక్ష్మి పథకం అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ద్వారా రాష్ట్రంలోని మహిళలకు దాదాపు 10 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుండి ఏ ప్రాంతానికైనా ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు నగదు పొదుపు జరుగుతుంని, తద్వారా ఆ నగదును కుటుంబ పోషణ నిమిత్తం వినియోగించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పథకంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మహిళల పేరిట పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలలో దాదాపు 5 వేల మంది విద్యార్థుల సంఖ్య పెరిగిందని అభినందించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ప్రహరీ గోడ, వంటశాల, త్రాగునీరు, అదనపు గదులు ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజున స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేయబడిన ఏకరూప దుస్తులను సకాలంలో విద్యార్థులకు అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా 16 బస్సులు వస్తున్నాయని, ఆర్ టి సి సంస్థకు లీజ్ కి ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేపట్టిన ఇందిరా మహిళ శక్తి భవన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, రాష్ట్రంలో ప్రథమంగా నిర్మాణం పూర్తి చేయబడి ప్రారంభానికి సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ భవన్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవచ్చు అని, శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. మహిళల సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని అన్నారు. మహిళను కుటుంబ పెద్దగా నిర్ధారించి అన్ని ప్రభుత్వ పథకాలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులను మహిళల పేరిట జారీచేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు అన్ని వ్యాపార రంగాలలో అభివృద్ధి చెందే దిశగా బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు.

ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జన్నారం మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం మహిళా సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ తాను గతంలో ఎక్కడికైనా వెళ్లాలి అంటే డబ్బుల గురించి ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా అందించిన ఉచిత బస్సు ప్రయాణంతో జిల్లా కేంద్రానికి, బంధువుల ఇండ్లకు, పనుల నిమిత్తం వెళ్లేందుకు ఆధార్ కార్డు తీసుకొని వెళ్లడంతో ప్రయాణ ఖర్చులు ఆదా అవుతున్నాయని తెలిపారు .

జైపూర్ మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తనకు సంవత్సరానికి దాదాపు 40 వేల రూపాయలు మిగులుతున్నాయని, రోజువారి పనిమీద తమ గ్రామం నుండి మంచిర్యాలకు వెళ్లాలంటే 100 రూపాయలు ఖర్చు అయ్యేదని, నెలలో 20 సార్లకు పైగా ప్రయాణం చేయవలసి ఉంటుందని తెలిపారు. తద్వారా నెలకు 2 వేల రూపాయల చొప్పున ఆదా అవుతుందని, పని నిమిత్తంతో పాటు బంధువుల ఇండ్లకు, దేవాలయాలకు సంతోషంగా వెళుతున్నానని, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా పొదుపు అయిన డబ్బులను కుటుంబ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు సంఘంలో పొదుపు పెంపొందించుకుంటున్నానని తెలిపారు.

బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన లత ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా తాను ఇప్పటివరకు 20 వేల రూపాయల వరకు లబ్ధి పొందానని తెలిపారు. శుభకార్యాలకు, షాపింగ్‌కు, దేవాలయాలకు, పిల్లల ఆసుపత్రులకు, బంధువుల కార్యక్రమాలకు వెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళ సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక చేయూతతో పాటు వివిధ వ్యాపార రంగాలలో అందిస్తున్న ప్రోత్సాహంతో వ్యాపార రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని, తద్వారా మరింత అభివృద్ధికి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఐస్‌క్రీంలు అమ్మితే రూ. 5,000 జరిమానా

**సారంగాపూర్, మార్చి 31, ప్రభాతవార్త**

పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలోని జాం గ్రామంలో ఐస్‌క్రీం విక్రయాలను నిషేధిస్తూ గ్రామ పంచాయతీ పాలకవర్గం, పెద్దలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ నిబంధనలు ఉల్లంఘించి గ్రామంలో ఐస్‌క్రీంలు విక్రయిస్తే రూ.5,000 జరిమానా విధిస్తామని సర్పంచ్ కరిపె రవళి హెచ్చరించారు. నాణ్యత లేని ఐస్‌క్రీంల వల్ల పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని, అనుమతి లేకుండా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారు.

# తాగునీటి లీకేజీలకు అడ్డుకట్ట

**- వేసవిలో నీటి ఎద్దడి నివారణే లక్ష్యం**

**సారంగాపూర్, మార్చి 31, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని ధని గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా సర్పంచ్ బడి పోతన్న ప్రత్యేక చర్యలు చేపట్టారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నుండి గత కొన్నేళ్లుగా వృథాగా పోతున్న నీటి లీకేజీలను అరికట్టేందుకు మరమ్మతులు చేయించారు. క్రేన్ సహాయంతో పైపుల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, లీకేజీ ఉన్న చోట వెల్డింగ్ పనులు పూర్తి చేశారు. నీరు వృథా కాకుండా చూడటం ద్వారా గ్రామస్థులకు వేసవిలో ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, ఉప సర్పంచ్ నారాయణ, తోట మల్లేష్, మేకల మల్లయ్య, రమేష్, రాజేందర్ పాల్గొన్నారు.



# పదవీ విరమణ మహోత్సవానికి హాజరైన ఆడే గజేందర్

**నేరడిగొండ, మార్చి 31, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలం బొందిడి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఆడే రమేష్ పదవీ విరమణ కార్యక్రమం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ వేడుకకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, ఆయన అందించిన విద్యా సేవలను కొనియాడారు. భవిష్యత్తులో ఆయన ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న సుదర్శన్ గౌడ్

**భైంసా, మార్చి 31, ప్రభాతవార్త:**

సాటి మనిషి ఆపదలో ఉన్నప్పుడు స్పందించడమే నిజమైన మానవత్వమని భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన సుదర్శన్ గౌడ్ నిరూపించారు. భైంసా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేగాం గ్రామానికి చెందిన లక్కడి మోహన్ అనే రోగికి అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. రక్తహీనతతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ రోగి పరిస్థితిని తెలుసుకున్న సుదర్శన్ గౌడ్ తక్షణమే స్పందించారు. ఆసుపత్రికి చేరుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేసి రోగి ప్రాణాలను కాపాడారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే సుదర్శన్ గౌడ్, క్లిష్ట సమయంలో రక్తదానం చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమయానికి రక్తం అందించి ఆదుకున్నందుకు రోగి కుటుంబ సభ్యులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి జీవన్

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

**నేరడిగొండ, మార్చి 31, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువుల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా పశువైద్యాధికారి జీవన్ నేతృత్వంలో సిబ్బంది ఇంటింటికీ తిరిగి టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రూపావత్ వెంకట్రావు మాట్లాడుతూ.. పశువులకు సోకే ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ పొందేందుకు రైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సురేష్, ఏ. వెంకన్న, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## దేవరకోట ఆలయ నూతన కమిటీ బాధ్యతల స్వీకారం

### ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: కూచాడి శ్రీహరిరావు

**నిర్మల్, మార్చి 31, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ దేవరకోట శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి మంగళవారం ఘనంగా బాధ్యతలు స్వీకరించింది. ఆలయ అభివృద్ధిలో కీలకమైన ఈ కమిటీ నియామక ప్రొసీడింగ్ పత్రాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు సభ్యులకు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆమెడ శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. డైరెక్టర్లుగా రాజేందర్, అనిత, కృష్ణవేణి, భీమేష్, గంగాధర్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ దేవరకోట ఆలయానికి ప్రత్యేక ఆధ్యాత్మిక గుర్తింపు తీసుకురావడంలో నూతన కమిటీ కీలక పాత్ర పోషించాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ పరిసరాల అభివృద్ధి, పూజా కార్యక్రమాల్లో పారదర్శకత పాటించాలని కోరారు. ఆలయాన్ని సుందరమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాల సహకారం తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులు స్పందిస్తూ, ఆలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని, భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామీణ స్థాయి నుంచి మొబైల్ నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేయాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మార్చి 31, ప్రభాతవార్త**



ప్రభుత్వ, ప్రైవేట్ మొబైల్ నెట్‌వర్క్‌లు తమ సేవలను గ్రామీణ స్థాయి నుండి విస్తరించి ప్రజలకు మెరుగైన నెట్ వర్క్ సేవలను అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి టెలికం కమిటీ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, శ్రీనివాస్ రావు లతో కలిసి ప్రైవేట్ నెట్ వర్క్, టి ఫైబర్ నెట్‌వర్క్‌ల ప్రతినిధులు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నెట్వర్క్ సేవలను గ్రామీణ స్థాయిలో మరింత అభివృద్ధి చేసి నాణ్యమైన సిగ్నల్స్ అందించే దిశగా కృషి చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బ్రాడ్ బ్యాండ్ సేవలను విస్తరించాలని, మొబైల్ టవర్లు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన సిగ్నల్స్ అందించాలని తెలిపారు. సమృద్ధి గ్రామపంచాయతీ, డిజిటల్ భారత్ నిధి పథకాల ఏర్పాటు కొరకు భూసేకరణ, టెలికాం మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. టెలికాం టవర్ సైట్ లకు విద్యుత్ సరఫరా విస్తరణ, ప్రభుత్వ సంస్థలకు బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ, భారత్ నెట్ ఇన్ఫ్రా వినియోగం అంశాలపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రైవేట్ నెట్వర్క్ లు టవర్ల ఏర్పాట్లు నిబంధనల ప్రకారం మార్కెట్ ధర ప్రకారం చెల్లింపులకు హామీ ఇచ్చినట్లయితే ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై అవగాహన సమావేశం

### ప్రతి ఓటరు వివరాలు సరిచూసుకోవాలి: తహసీల్దార్ సతీష్ కుమార్

**మందమర్రి, మార్చి 31, ప్రభాతవార్త**

మందమర్రి మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధులతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్ -2026) కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల తహసీల్దార్ సతీష్ కుమార్ కార్యక్రమానికి సంబంధించిన ముఖ్యాంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్ కు ఎన్యూమరేటర్ ఫారంలో పూర్తి వివరాలు సమర్పించాలని తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులో ఏమైనా పొరపాట్లు ఉన్నట్లయితే వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. అలాగే బూత్ స్థాయిలో సహాయకులుగా పని చేయడానికి బూత్ లెవల్ ఏజెంట్లు ను నియమిస్తామని, ఈ ప్రక్రియలో వారి సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి ఓటరు చురుకుగా పాల్గొని సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.





## బెల్లంపల్లి షంషీర్‌నగర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహణ

**బెల్లంపల్లి, మార్చి 31, ప్రభాతవార్త**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో షంషీర్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ పి. సుచరిత ప్రారంభించగా, ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ పర్యవేక్షించారు. శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఆర్. ప్రియదర్శిని, పీడియాట్రిషన్ డాక్టర్ పి. విక్రమ్, ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ రాజు యాదవ్, కంటి వైద్యురాలు డాక్టర్ రాశినీ, జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ వాసుదేవరెడ్డి, డెంటల్ వైద్యుడు డాక్టర్ సాబిర్ తదితర నిపుణ వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన చికిత్స అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలు హెచ్పివి వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. అలాగే బీపీ, షుగర్ వంటి అసంక్రమణ వ్యాధుల నివారణకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ వంటి కీటక జనిత వ్యాధుల నివారణకు పరిశుభ్రత పాటించడం అత్యవసరమని, గ్రామపంచాయతీ సహకారంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జీవనశైలి మార్పులతో వచ్చే వ్యాధులను దూరం చేసుకోవడానికి యోగా, వ్యాయామం అలవాటు చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సీపీ 509 మొక్కజొన్న క్షేత్ర ప్రదర్శన..

### అధిక దిగుబడిపై రైతులకు అవగాహన

**నర్సాపూర్(జి), మార్చి 31, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని రైతు ఆయిటి మహేష్ పంట పొలంలో సీపీ కంపెనీ ఆధ్వర్యంలో సీపీ.509 మొక్కజొన్న విత్తన రకంపై క్షేత్ర ప్రదర్శన, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధి డి. చిన్నయ్య మాట్లాడుతూ, సీపీ.509 విత్తన రకంతో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. పంట సాగులో పాటించాల్సిన ఆధునిక మెళుకువలను రైతులకు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో పంట ఎదుగుదల, గింజ కట్టడాన్ని చూసి రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్లు రమేష్ రెడ్డి, బాలాజీ, కంపెనీ సిబ్బంది కె. ప్రశాంత్, వై. పవన్, గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, నర్సారెడ్డి, కిష్టారెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామాలలో పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించాం

### - జిల్లా వ్యవసాయ సంచాలకులు ఎం. కృష్ణ

**లక్షెట్టిపేట, మార్చి 31, ప్రభాతవార్త**



మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నష్టం పై సమగ్ర సర్వే నిర్వహించినట్లు వ్యవసాయ సంచలకులు ఎం. కృష్ణ తెలిపారు. మంగళవారం రోజున మండలంలో పంట నష్టం అంచనాలో భాగంగా జెండా వెంకటాపూర్ గ్రామాన్ని సందర్శించడం జరిగింది. ఈదురు గాలులతో సోమవారం రాత్రి నేలకొరిగిన మొక్కజొన్న పంటను సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. కృష్ణ, మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్‌తో కలిసి సందర్శించడం జరిగింది. ప్రాథమికంగా మండలంలో జెండా వెంకటాపూర్, ఎల్లారం, వెంకట్రావుపేట, బలరావుపేట్, ఇటిక్యాల్, దౌడేపల్లి, లక్ష్మీపూర్ గ్రామాలలో సుమారు 200 ఎకరాల వరకు మొక్కజొన్న పంట నష్టం జరిగినట్టు అంచనా వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీకాంత్‌తో పాటు మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**- బెల్లంపల్లి ఏరియా జిఎం విజయభాస్కర్ రెడ్డి**

**తాండూర్, మార్చి 31, ప్రభాతవార్త :**

ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా జిఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మాదారం టౌన్షిప్ లోని శ్రీ కోదండ రామాలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన సీతారాముల నాగవెల్లి కార్యక్రమంలో జిఎం తన సతీమణి పద్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 25వ తేదీ నుండి రామాలయంలో సీతారాముల ఎదుర్కోలు, కళ్యాణోత్సవం, హోమం, నాగవేల్లి కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ముద్దు అవధూత శర్మ వేదమంత్రోర్చనలు, భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు నిత్యం దేవాలయాలను సందర్శించి భగవంతుడి నామస్మరణ చేయడం వలన మానసిక ప్రశాంతత, ఆనందం ఏర్పడుతుందన్నారు. ప్రజలు మతాలకతీతంగా ఐక్యమతంగా పండుగలు, ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఆలయ అర్చకులు ముద్దు అవధూత శర్మ జిఎం దంపతులతో పాటు బెల్లంపల్లి ఓసి ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్ దంపతులకు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా మహిళలు సీతాదేవికి ఒడి బియ్యం పోశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సీతారాముల నాగవేల్లి కార్యక్రమంలో పాల్గొన్న జిఎం విజయ భాస్కర్ రెడ్డి, పిఓ ఉమాకాంత్ దంపతులు



## ఘనంగా భక్తాంజనేయ ఆలయ వార్షికోత్సవం

**జన్నారం, మార్చి 31, ప్రభాతవార్త**

జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామం లోని శ్రీ శ్రీ భక్తాంజనేయ, మహాగణపతి శివ పంచాయతన, స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం గ్రామస్తులు, హనుమాన్ చిట్టి కమిటీ సభ్యులు, సర్పంచ్ వాసాల నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆంజనేయస్వామి భక్తులు హోమాలు, యజ్ఞలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్రీరామ ఆంజనేయ స్వామి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.

## 2న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభ

**జన్నారం, మార్చి 31, ప్రభాతవార్త**

ఈ నెల 2న గురువారం నాడు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పొనకల్ గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించబడుతుంది అని పంచాయతీ కార్యదర్శి రాహుల్ తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే గ్రామసభకు పంచాయితీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు,అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎసిపి కిరణ్ కుమార్ చర్యలు అభినందనీయం

**బెల్లంపల్లి, మార్చి 31, ప్రభాతవార్త**



ఎసిపికి పుష్పగుచ్చం అందజేస్తున్న చిలుక రాజనర్సు

బెల్లంపల్లికి నూతనంగా బదిలీపై వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఎసిపి) కిరణ్ కుమార్‌ని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చిలుక రాజనర్సు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య పలు ముఖ్య అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో మెయిన్ రోడ్డుపై ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చిలుక రాజనర్సు ఎసిపి దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌లో ఏర్పాటు చేసిన యూ టర్న్‌ల కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని వివరించారు. ఈ సమస్యను గమనించిన ఏసిపి కిరణ్ కుమార్ పట్టణంలోని రద్దీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అవసరం లేని యూటర్న్‌లను మూసివేసి రహదారిని క్రమబద్ధీకరించిన చర్య అభినందనీయమని రాజనర్సు పేర్కొన్నారు. అదేవిధంగా బెల్లంపల్లి డివిజన్‌లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎసిపి కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎసిపి కిరణ్ కుమార్ ఈ సందర్భంగా సూచించారు.

## మాదక ద్రవ్యాల వ్యసనాలు మానని మైనర్ బాలుడు

**- అరెస్ట్ చేసి డి అడిక్షన్ సెంటర్‌కు తరలించిన పోలీసులు**

**చెన్నూరు, మార్చి 31, ప్రభాతవార్త**

మాదక ద్రవ్యాలకు అలవాటు పడి వాటికి బానిసైన ఒక మైనర్ బాలున్ని చెన్నూరు పోలీసులు అరెస్ట్ చేసి మంచిర్యాల డి అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణానికి చెందిన 17 సంవత్సరాల మైనర్ బాలుడు గంజాయి త్రాగుటకు అలవాటుపడటంతో అతనిని మంగళవారం రోజు పోలీసులు అరెస్ట్ చేసి డీఅడిక్షన్ సెంటర్ కు తరలించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ మైనర్ బాలుడు గత కొంతకాలంగా తన స్నేహితులతో కలసి గంజాయి త్రాగుటకు అలవాటుపడ్డాడని, మహారాష్ట్ర నుంచి గంజాయి కొనుగోలు చేసి సేవిస్తుండటంతో గతంలో ఇతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. తన ప్రవర్తన మార్చుకోకుండా తరచు గంజాయి సేవిస్తున్నాడని మాకు సమాచారం రావడంతో అతనిని పట్టుకొని మెడికల్ ఆఫీసర్ సమక్షంలో గంజాయి వైద్య పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రిపోర్ట్ రావడంతో అతనిపై సెక్షన్ 27 బి ఎండీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదుచేసి చెన్నూర్ న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టామన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం రోజున బాలుడి ప్రవర్తనలో మార్పు రావడం కొరకు మంచిర్యాలలోని డీఅడిక్షన్ సెంటర్ కు పంపించడం జరిగిందన్నారు.

## విద్యుత్ ఘాతంతో మహిళ మృతి

**- తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ముగ్గురు పిల్లలు**

**- ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకోలు**



**చెన్నూరు, మార్చి 31, ప్రభాతవార్త**

చెన్నూరు మండలం కొమ్మెర గ్రామంలో మంగళవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో మేడగోని జ్యోతి అక్కడికక్కడే మరణించింది. ఉతికిన బట్టలు ఆరవేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయింది. పదిహేనేళ్ల క్రితమే తండ్రిని కోల్పోయిన ఆ కుటుంబానికి, ఇప్పుడు తల్లి కూడా దూరం కావడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. జ్యోతికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త చనిపోయినప్పటి నుండి తనే అన్నీ తానై పిల్లలను పెంచి పోషిస్తోంది. ఇప్పుడు తల్లి కూడా మరణించడంతో ఆ పిల్లల రోదనలు స్థానికులను కలచివేస్తున్నాయి. అనాథలైన పిల్లలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కొమ్మెర గ్రామస్తులు కోరుతున్నారు.



శోభయాత్రలో పాల్గొన్న జైనులు

## ఘనంగా మహావీర్ జయంతి వేడుకలు

**ఆసిఫాబాద్, మార్చి 31, ప్రభాతవార్త**

మహావీర్ జయంతి వేడుకలను జైనులు ఘనంగా నిర్వహించారు. మహావీర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలో జైనులు ఆలయాలకు వెళ్లి మహావీరుని విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆయన చిత్రపటంతో పట్టణంలోని పలు విధుల గుండా మహిళలు కొలటాలు చేస్తూ శోభయాత్ర నిర్వహించారు. ఈ శోభయాత్రలో మార్కెటింగ్ కమిటి చైర్మన్ మంగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైనులు మాట్లాడుతూ మహావీర్ జయంతి తమకు అత్యంత పవిత్రమైన పండుగ అని, ఈ రోజును భగవాన్ మహావీరుడు జన్మించిన రోజుగా స్మరించుకుంటామన్నారు. ఆయన జీవితం అహింస సందేశాన్ని గుర్తు చేస్తున్నాయని, ఆయన భోదనలు ప్రతీ ఒక్కరికి ఆదర్శనియమన్నారు. ఈ కార్యక్రమంలో జైనులు దిలీప్, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల నిర్వహణలో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

**- డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ లక్ష్మీకుమారి**

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 31, ప్రభాతవార్త :**

పరిశ్రమల నిర్వహణలో కార్మికులు, పరిశ్రమ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డైరెక్టర్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ లక్ష్మీకుమారి అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్ పరిశ్రమలో నిర్వహించిన 65వ జాతీయ భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మాట్లాడుతూ పరిశ్రమల నిర్వహణలో కార్మికుల సంక్షేమముతో పాటు పరిశ్రమ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమైనదని, కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మార్చి 1వ తేదీ నుండి ప్రారంభమైన భద్రత మాసోత్సవాలు మంగళవారంతో ముగిశాయని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధితో ప్రాంతం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని, ఇందులో భాగంగా భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేపర్ మిల్ జనరల్ మేనేజర్ (హెచ్ ఆర్/ఐ ఆర్) ఎంఎస్ గిరి, సేఫ్టీ మేనేజర్ ఆర్. శ్రీనివాస్, వర్కర్ల ప్రతినిధి ఎ. కె. మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా ఇందిరమ్మ కాలనీలో అధికారుల సర్వే

**తాండూర్, మార్చి 31, ప్రభాతవార్త :**



మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం అధికారులు, గ్రామ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా సర్వే నిర్వహించారు. వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయంలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇండ్ల స్థలాల పట్టాలతో పాటు లబ్ధిదారుల ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు జిరాక్స్ పత్రాలను తీసుకొని లబ్ధిదారుల కుటుంబ సభ్యులలో ఒకరిది ఫోటోను లబ్ధిదారుల ఇండ్ల స్థలాల వద్ద గ్రామ కార్యదర్శులు సెల్ ఫోన్లలో చిత్రీకరించారు. సర్వేను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టామన్నారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపిఓ అనిల్ కుమార్, గిర్దావర్ ఏజాజోద్దీన్, కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.


రోడ్డు భద్రత నియమాలు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కిరణ్ కుమార్

## ప్రజలందరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

**హాజీపూర్, మార్చి 31, ప్రభాతవార్త**

ప్రజలందరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని,ప్రజల భద్రతే పోలీసు ప్రధాన ధ్యేయం అని హాజీపూర్ ఎస్సై కిరణ్ కుమార్ అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల ప్రాణ భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అరైవ్ అలైవ్ - 2026 మూడో దశ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.రాష్ట్ర డీజీపీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టబడుతుందని, పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల తగ్గింపు, ట్రాఫిక్ నిబంధనల పై ప్రజల్లో అవగాహన కల్పించడం, సురక్షిత ప్రయాణం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముల్కల్ల రేవు వద్ద ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన కల్పించడం జరిగింది. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ముఖ్య కూడళ్ల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ప్రచారం చేయనున్నట్లు తెలిపారు హెల్మెట్ అమలు కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు ప్రత్యేక తనిఖీ డ్రైవ్‌లు నిర్వహించి, పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సీట్‌బెల్ట్ అమలు కార్యక్రమంలో భాగంగా ప్రధాన కూడళ్లలో నాలుగు చక్రాల వాహనాలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదనే అంశంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజల భద్రత, ప్రాణ రక్షణ పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై తెలిపారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఏ ఆనర్స్ కోర్సు ప్రారంభం

**బెల్లంపల్లి, మార్చి 31, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రతిష్టాత్మకమైన బిఏ ఆనర్స్ కోర్సు ప్రారంభం కానుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఉన్నత విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగంగా ఈ కోర్సును ప్రవేశపెడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిఏ ఆనర్స్ కోర్సులో విద్యార్థులు ఒకే సబ్జెక్టును స్పెషలైజేషన్‌గా మూడు సంవత్సరాల పాటు లోతుగా అభ్యసించే అవకాశం ఉంటుంది. ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉన్న విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్ కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ (హెచ్‌ఈసి, సిఈసి, ఎమ్పిసి, బైపీసీ), వొకేషనల్ కోర్సులు పూర్తి చేసిన వారు, పాలిటెక్నిక్ డిప్లమా విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులని పేర్కొన్నారు. అన్ని విభాగాల విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్టును ఎంపిక చేసుకుని చదువుకోవచ్చని తెలిపారు. తెలంగాణ మల్టీ జోన్1 పరిధిలో ఈ కోర్సు అందుబాటులో ఉన్న ఏకైక ప్రభుత్వ కళాశాలగా బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిలిచిందని చెప్పారు. ఇప్పటివరకు ఢిల్లీ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీలలో మాత్రమే లభ్యమవుతున్న ఈ కోర్సు ఇప్పుడు బెల్లంపల్లిలో అందుబాటులోకి రావడం విశేషమన్నారు. కళాశాల అభివృద్ధి విషయానికొస్తే, 2018కి ముందు పరిమిత కోర్సులతో ఉన్న ఈ కళాశాల, 2019 తర్వాత సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టి గణనీయంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. ప్రస్తుతం బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు పలు నూతన కోర్సులు అందుబాటులో ఉండగా, విద్యార్థుల సంఖ్య 800 దాటినట్లు వివరించారు. బిఏ ఆనర్స్ ప్రవేశంతో కళాశాల మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బిఏ ఆనర్స్ కోర్సు ద్వారా యూపీఎస్సీ, టీఎస్పీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. డిగ్రీ అడ్మిషన్లు దోస్త్ నోటిఫికేషన్ ద్వారా జరుగుతాయని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9959269975 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్

# వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

**- ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్**

**ఉట్నూర్, మార్చి 31,ప్రభాత వార్త :**

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని అర్థమయ్యే రీతిలో భోదించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని చించుఘాట్, వన్వాట్ గిరిజన ఆశ్రమ పాఠశాలలు మరియు స్టార్ ఫిఫ్టీ కళాశాల ను ప్రాజెక్ట్ అధికారి సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఇష్ట గోష్టితో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా సమయానికి భోజనాన్ని అందిస్తున్నారా మెనూ ప్రకారంగా అందిస్తున్నారా భోజనాలు రుచికరంగా ఉన్నాయా అని తెలుసుకొని క్లాస్ రూమ్ లో విద్యార్థులతో ముచ్చటించి వారికి పాఠలను బోధించారు విద్యార్థులకు వండిన ఆహారాన్ని రుచిని ఆస్వాదించారు, అలాగే కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు ,ఐటీడీఏ పల్స్ యాప్ పనితరుపై ఆరా తీశారు, పదవ తరగతి విద్యార్థులకు 100 ఉతిర్ణత వచ్చే విధంగా చదివిపించాలని ఉపధ్యాయులకు తెలిపారు, పల్స్ యాప్ పై ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు ఈ సందర్భంగా


సమస్యలను విద్యార్థులకు అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పి ఓ యువరాజ్ మర్మాట్

ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు వార్డెన్, ప్రిన్సిపల్క్, కామటీ, వంట పని వారు, శానిటరీ మరియు మల్టీపర్పస్ వర్కర్లు కు సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ అన్నారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు, పనిచేసే వర్కర్లు సమయానికి లేనందున వారిపై అగ్రం వ్యక్తం చేసి సోకాసు నోటీసు జారీ చేయమని ఆదేశించారు, స్టార్ ఫిఫ్టీ కళాశాలలో సెకండ్ ఇయర్ ఎంపీసీ బైపీసీ విద్యార్థులతో ముచ్చటించి వారి నోట్సున్ని పరిశీలించి సిలబస్ మరియు పరీక్షల తేదీలను వివరాలను కనుగొన్నారు మరియు ఉన్నత విద్యా అభ్యసించుటకు కొన్ని సూచనలు చేస్తూ ఐఐటీలో ఏ కోర్సు మరియు ఏ కళాశాల ఎంచుకుంటున్నారు అని విద్యార్థులను ఆరా తీశారు, వారికి తగిన కళాశాలలో ఎంచుకోవాల్సిందిగా తెలిపారు, ఫస్ట్ ఇయర్ విద్యార్థులతో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం మరింత కృషి పడి చదివి వచ్చే విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలను సాధించాలని తెలిపారు,ఈ కార్యక్రమాలలో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డిప్లొమా కోర్సుల్లో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

**ఆసిఫాబాద్, ప్రభాతవార్త :**

2026-27 విద్యా సంవత్సరానికి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ మంగళవారం తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ ఆధ్వర్యంలో ఆ శాఖ డైరెక్టర్ శృతి ఓజా సూచనల మేరకు హైదరాబాద్ లోని దుర్గా బాయ్ దేశ్ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్ట అనాథలు, నిరాధారులు, ట్రాఫికింగ్ బాదితులు వంటి వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించబడుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొత్తం సీట్లలో 70 శాతం సీట్లు ఈ వర్గాలకు కేటాయించబడ్డాయన్నారు. ఈ సంస్థలో మొత్తం 6 డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయని, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, సెమీకండక్టర్ టెక్నాలజీ (కొత్త కోర్సు), ల్యాండ్స్కేప్ డిజైన్ (కొత్త కోర్సు) వంటి కోర్సులు ఉన్నాయని తెలిపారు. ప్రతి కోర్సులో 60 సీట్లు ఉండగా మొత్తం సీట్లు 360గా ఉన్నాయని, ఇందులో 70 తో 252 సీట్లు అనాథలు, నిరాధారులకు కేటాయించబడ్డాయన్నారు. అభ్యర్థులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. టిఎస్ పాలీసెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వబడిందన్నారు. ఇట్టి దరఖాస్తులను మే 25 లోపు హైదరాబాద్ లోని డైరెక్టర్, మహిళలు బాలల సంక్షేమ శాఖ కార్యాలయంకు పంపించాలన్నారు. అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## సజావుగా ముగిసిన కొత్తపల్లి వారసంత వేలం

**తాండూర్, మార్చి 31ప్రభాతవార్త :**

మండలంలోని కొత్తపల్లి వారసంత 2026 -27 ఆర్థిక సంవత్సరానికి గాను కూరగాయలు, మేకల మార్కెట్ నిర్వహణ బహిరంగ వేలం పాటను మంగళవారం వారసంత ఆవరణలో నిర్వహించారు. ఎంపీఓ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ ఆకుల వెంకటేష్ అధ్యక్షతన గ్రామ కార్యదర్శి లక్ష్మణ్ వేలంపాట నిర్వహించారు. కూరగాయల మార్కెట్ నిర్వహణనుతాండూర్ కు చెందిన ఒలపు తిరుపతి రూ. 4,97,000లు,మేకల మార్కెట్ నిర్వహణనుదేవాపూర్ కు చెందిన ఎల్లబోయిన సతీష్ రూ.11 లక్షలతో అత్యధికంగా పాటు పడి దక్కించుకున్నారు. వారసంత వేలం పాట సజావుగా ముగియడంతో అందరూ పీల్చుకున్నారు.


వారసంత వేలం పాటలో నిర్వహిస్తున్న అధికారులు

## మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

**ఆసిఫాబాద్, మార్చి 31, ప్రభాతవార్త :**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిదని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టిసి ప్రయాణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాలక్ష్మి పథకం ప్రత్యేక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్షి ్మ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒక వరం అని, ఈనెల 29వ తేదీ నాటికి జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు 77 కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా చిన్నచిన్న వ్యాపారాలు, వీధి వ్యాపారాలు చేసే మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని తెలిపారు. గతంలో ఏదైనా పని ఉన్నట్లయితే పురుషులు మాత్రమే వెళ్లేవారని, ఇప్పుడు మహిళలే పనులను పూర్తిచేసుకుని వస్తున్నారని, ఈ క్రమంలో ప్రభుత్వం చేపట్టిన మహాలక్షి ్మ పథకం ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ధైర్యం, భరోసా కల్పించిందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాలు ప్రవేశపెడుతున్నాయని, తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ప్రతి ప్రయాణికురాలు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా నిత్యం ప్రయాణించే మహిళలకు శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం ఆర్టిసి సిబ్బంది జిల్లా కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్, ఆర్ టి సి సిబ్బంది, మహిళా ప్రయాణికులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




బడ్జెట్లో పాల్గొన్న ప్రజాపతినిధులు,అధికారులు



క్రింద కూర్చొని నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

# అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్..

## 37.80 కోట్లతో మొదటి బడ్జెట్ ప్రతిపాదన

**ఆసిఫాబాద్, మార్చి 31, ప్రభాతవార్త**

మున్సిపాలిటీ ఆవిర్భవించిన తర్వాత ఎన్నికలు జరిగి పూర్తి కౌన్సిల్ ఆధ్వర్యంలో మొదటి బడ్జెట్ సమావేశాలు మంగళవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ అధ్యక్షతన జరగాయి. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్‌తో పాటు, స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి, వైస్ చైర్మన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గజానంద్ కౌన్సిలర్లు హాజరయ్యారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించడంతో బిఆర్ఎస్ కౌన్సిలర్లతో మున్సిపల్ ప్రథమ బడ్జెట్ 37.80 కోట్లతో కౌన్సిల్ ఆమోదం పొందింది. బడ్జెట్ ను మూడు భాగాలుగా చేయగా మున్సిపాలిటీకి స్వతహాగా వచ్చే నిధులు 5.0144 కోట్లు కాగా అంతే మొత్తంలో జీతాలు ఇతర ఖర్చులు చూపించారు. డిపాజిట్ల రూపంలో 60 లక్షల నిధులు వస్తుండగా దానికి సంబంధించి అంతే మొత్తం ఖర్చు చూపించారు. ఇతర గ్రాంట్ల విభాగంలో నాన్ ప్లాన్ విభాగంలో 5 కోట్లు, ప్రణాళిక విభాగంలో 3.65 కోట్లు, ఇతర నిధులు 23.54 కోట్లు రానున్నట్లు అంచనా వేసిన అధికారులు మౌలిక వసతుల కల్పన కోసం ఇతర గ్రాంట్ల ద్వారా వచ్చిన 32.19 కోట్లు ఖర్చు చేయనున్నట్లు బడ్జెట్లో పొందుపరిచారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు పలు సందేహాలను లేవనెత్తగా అధికారులతో పాటు ఎమ్మెల్యే వాటిని నివృత్తి చేసే ప్రయత్నం చేశారు. ఏది ఏమైనా ప్రథమ బడ్జెట్ లో సగం మంది కౌన్సిలర్లతో బడ్జెట్ ఆమోదం పొందింది.

### కాంగ్రెస్ కౌన్సిలర్లకు దక్కని మర్యాద..

నేలపై కూర్చొని నిరసస్థానిక మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీకి మొదటి నుండి ఎదురుగాలి వీస్తుండగా తాజాగా మంగళవారం స్థానిక మున్సిపాలిటీలో కమిషనర్ గజానంద్ అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కూడా కనీసం మర్యాద పాటించకపోవడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు అబ్దుల్లా, కార్తీక్, వినోద్, గోవింద్, తారాబాయి, పుష్పలత, భారతి, భాగ్యలక్ష్మి, కృష్ణమ్మ, స్వప్నరాణి నిరసన వ్యక్తం చేసి సమావేశాన్ని బహిష్కరించారు. అలాగే కేవలం లక్ష రూపాయలు మాత్రమే ఖర్చయే చోట నాలుగు లక్షలు రూపాయలు ఖర్చు చేసినట్లు చూపి చైర్మన్ గది సిద్ధం చేసినప్పటికీ దానిలో సమావేశం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ నిబంధనలు కనీసం పాటించడం లేదన్నారు. బడ్జెట్ ఎజెండా కూడా తమతో చర్చించలేదని, మొదటి సమావేశంలో కమిషనర్ కనీస అవగాహన లేకుండా వ్యవహరించడంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.నేలపై కూర్చొని నిరసకాంగ్రెస్ కౌన్సిలర్ లేకుండానే సమావేశం ప్రారంభించడంతో కొద్దిసేపు కార్యాలయం ఎదుట అనంతరం కమిషనర్ గదిలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎదురు చూశారు. కమిషనర్ గదిలో కుర్చీలు కూడా లేకపోవడంతో కౌన్సిలర్లు నిలబడి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. అక్కడినుండి సమావేశ గదిలోకి వెళ్లి తమకు కనీసం మర్యాద ఇవ్వలేదని నేలపై కూర్చొని అదనపు కలెక్టర్ డేవిడ్, స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మిల సమక్షంలో నిరసన తెలిపారు. సమావేశం బహిష్కరణ తర్వాత కౌన్సిలర్ నేరుగా వెళ్లి జిల్లా కలెక్టర్ కె హరితకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి నిర్ణయం తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# రైలు ఢీకొని వ్యక్తి మృతి

**తాండూర్, మార్చి 31 ప్రభాతవార్త :**

మండలంలోని ఐబి శనివారం వారసంత సమీపంలో రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు జి ఆర్ పి హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కథనం ప్రకారం..... తాండూర్ మండలం చంద్రపల్లి గ్రామానికి చెందిన కంబాల బక్కయ్య (78) అనే వృద్ధుడు రైల్వేట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని మరణించడని తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



శాలువాతో సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ కుక్డే సంతోష్

# గురుకులాల్లో సత్తా చాటిన ఎస్ ఆర్ పాఠశాల విద్యార్థులు

**సిర్పూర్ (టి) మార్చి 31, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎస్ ఆర్ పాఠశాల విద్యార్థులు ఆరుగురుగురుకుల ప్రవేశాల్లో సత్తా చాటారు. మంగళవారం రోజున పాఠశాల ప్రిన్సిపాల్ కుక్కడే సంతోష్ గురుకులాల్లో సీట్లు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తారని విద్యార్థులు ఒక లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ దుర్గం వసంతరావు విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# చిన్నారుల ప్రతిభకు లెర్నిష్టి వేదిక

**మంచిర్యాల,మార్చి 31, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లోని ఎథిక్ అకాడమీ పాఠశాలలో లెర్నిష్టి పేరుతో నిర్వహించిన అకడమిక్ ఫేర్ ఆకట్టుకుంది. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులు సంవత్సరం పొడవునా నేర్చుకున్న అంశాలను క్రియేటివ్,వర్కింగ్ మోడల్స్ రూపంలో ప్రదర్శించారు. ప్రత్యేకంగా నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ చిన్నారులు తమ మోడల్స్‌ను స్వయంగా వివరిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ స్థాయి చిన్నారులతో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఈ పట్టణంలో మొట్టమొదటిసారి కావడం విశేషం. పిల్లల ప్రతిభను చూసిన తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రశంసలు కురిపించారు. కార్యక్రమంలో డైరెక్టర్ చరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మి రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ చరణ్ రెడ్డి మాట్లాడుతూ,"పుస్తకాలకే పరిమితం కాకుండా పిల్లలు నేర్చుకున్నది అనుభవంతో చూపించగలరని లెర్నిష్టి ద్వారా నిరూపించాం అని తెలిపారు.



# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

**లక్షెట్టిపేట, మార్చి 31, ప్రభాతవార్త**

మండలంలో గుల్లకోట గ్రామపంచాయతీలో జరుగుచున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో కే. సరోజ పరిశీలించారు. మంగళవారం రోజు గుల్లకోట గ్రామపంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించి, అనగా మండల సమాఖ్య బిల్డింగ్, గ్రామ పంచాయతీ నర్సరీ, గ్రామ పంచాయతీ భవనంలో రీఛార్జి స్ట్రక్చర్ కట్టుటకు సర్పంచి, గ్రామ పంచాయతీ సెక్రటరీ కి పలు సూచనలు ఇవ్వడం జరిగింది. గ్రామ పంచాయతీలో హెచ్ఆర్సీ మీటింగ్‌కు అటెండ్ అయ్యి వార్డు మెంబర్లకు, గ్రామ ప్రజలకు పంచాయతీ రాజ్ లో జరుగుతున్న పనులు, ఉపాధి హామీ గురించి వారికి సవివరంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి, క్షేత్ర సహాయకుడు, వేతన కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మిక సమస్యలపై నిర్మాణాత్మక సమీక్షా సమావేశం

## - ఏఐటీయూసీ గుర్తింపు సంఘంతో 16వ స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహణ

**మందమర్రి, మార్చి 31, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ)తో 16వ స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించారు. సింగరేణి కార్మికుల పలు సమస్యలపై మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నిర్మాణాత్మక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ సెక్రటరీ అక్బర్ అలీతో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.ఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపులో కార్మిక సంఘాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి పెంపుతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై పురోగతిని సమీక్షించిన అనంతరం, గుర్తింపు సంఘం నాయకులు ప్రస్తావించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఇప్పటివరకు అందించిన సహకారాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించాలని కార్మిక సంఘ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో కేకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, కె.కె గ్రూప్ ఏజెంట్ రాంబాబు, డీజీఎం పర్సనల్ అశోక్, డీజీఎం ఐఈడీ కిరణ్ కుమార్, ఏరియా స్టోర్స్ డీజీఎం ఈ అండ్ ఎం సురేష్, వర్క్‌షాప్ డీజీఎం ఈ అండ్ ఎం దూప్ సింగ్, డీవైపీఎం సందీప్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, సివిల్ ఈఈ రాజు, ఏఐటీయూసీ మందమర్రి వైస్ ప్రెసిడెంట్ సుదర్శనం, సీనియర్ నాయకులు కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.









# కుమురంభీం జిల్లాకు గర్వకారణం..

### - భారత ప్రభుత్వం నుంచి పేటెంట్ సాధించిన విద్యార్థి-గురువులు

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 31, ప్రభాతవార్త :**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని విద్యా రంగానికి గర్వకారణమైన ఘనత దక్కింది. సిర్పూర్ (టి) మండలం భోపాలపట్నం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు మోల్కరి కేశవ్, విద్యార్థిని అల్సా మమత రూపొందించిన వినూత్న సైన్స్ ప్రాజెక్ట్‌కు భారత ప్రభుత్వం డిజైన్ పేటెంట్ మంజూరు చేసింది. జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ మార్గదర్శకత్వంలో రూపొందిన ఈ ప్రాజెక్ట్‌కు మార్చి 30, 2026న పేటెంట్ ఆమోదం లభించింది. ఖుగభారీ రద్దీ ప్రాంతాలలో పార్కింగ్ నిర్వహణ" అనే ఈ ప్రాజెక్ట్‌కు అప్లికేషన్ నంబర్ 486267-001, సిబిఆర్ నంబర్ 200292గా నమోదు అయింది. గ్రామీణ ప్రాంత పాఠశాల నుంచి ఈ స్థాయి విజయాన్ని సాధించడం విశేషంగా నిలిచింది. ప్రస్తుతం పట్టణాలు, పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ సమస్య తీవ్రంగా మారుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ స్మార్ట్ పరిష్కారాన్ని అందిస్తోంది. ఇందులో ఐఆర్ సెన్సర్, ఎల్ఈడి డిస్‌ప్లే సాయంతో పార్కింగ్ స్లాట్‌లో వాహనం ఉందా లేదా సులభంగా గుర్తించే విధంగా వ్యవస్థను రూపొందించారు. వాహనం ఉన్నప్పుడు స్లాట్ ఫుల్", ఖాళీగా ఉన్నప్పుడు స్లాట్ ఎంటి" అని డిస్‌ప్లేలో చూపిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో ఉపయోగించిన ఆర్డుఇనో యూనో, ఐఆర్ సెన్సర్, ఎల్ఈడి డిస్‌ప్లే వంటి పరికరాలు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండటంతో స్కూళ్లు, షాపింగ్ మాల్‌లు, అపార్ట్‌మెంట్లు వంటి ప్రదేశాల్లో విస్తృతంగా అమలు చేసే అవకాశముంది. ఇది మానవ శ్రమను తగ్గించడంతో పాటు సమయాన్ని ఆదా చేయడంలో కూడా ఉపయోగపడుతుంది. ఇదే కాకుండా, ఈ ప్రాజెక్ట్ స్టేట్ లెవల్ ఎన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక కావడం మరో విశేషం. జిల్లా స్థాయిలో పాఠశాల నుంచి భారత ప్రభుత్వం పేటెంట్ సాధించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. విద్యార్థి-గురువుల కృషి, సృజనాత్మకతపై జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఈ విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ విజయంతో జిల్లాలోని విద్యార్థుల్లో సైన్స్, టెక్నాలజీపై ఆసక్తి పెరిగి, భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలు వెలుగులోకి రావాలని ఆశాభావం వ్యక్తమవుతోంది.

### పేదలకు వరం

# సీఎం రిలీఫ్ ఫండ్

**వేమనపల్లి, మార్చి 31, ప్రభాతవార్త**

సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ తో కలిసి అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన రూ. 1 లక్ష 50 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, సర్పంచ్‌లు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయికృష్ణ, ముల్కల్ల శ్రీలత, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, నైతం శంకర్, నికాడి భగవంత్, కామెర గణేష్, మంత్రి రమేష్ లబ్ధిదారులు, నాయకులు, పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

# రేషన్ సరఫరాలో నిర్లక్ష్యం... ఐదు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

### - డీలర్‌పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి

**మందమర్రి, మార్చి 31, ప్రభాతవార్త**




తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రి మండలంలోని సారంగపల్లి, శంకర్పల్లి గ్రామపంచాయతీలకు చెందిన ప్రజలు రేషన్ సరఫరాలో జరుగుతున్న నిర్లక్ష్యంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలయ్య, లింగయ్య, షబీర్, ఎర్ర రాజు, యువజన నాయకులు రాయబారపు కిరణ్ లు మందమర్రి మండలం తహసిల్దార్ సతీష్ కుమార్ కి వినతిపత్రం అందజేశారు. మండలంలోని సారంగపల్లి, శంకర్ పల్లి గ్రామపంచాయతీలకు చెందిన ప్రజలు రేషన్ సరఫరాలో జరుగుతున్న నిర్లక్ష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామపంచాయతీలకు ఒకే రేషన్ డీలర్‌గా మిట్టపెల్లి వెంకటేష్ నియమించబడినప్పటికీ, ఆయన స్వయంగా ఎప్పుడూ రేషన్ పంపిణీ చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. డీలర్ స్థానంలో మిట్టపెల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి రేషన్ పంపిణీ నిర్వహిస్తున్నప్పటికీ, ఆయన కూడా సమయానికి సరఫరా చేయడం లేదని ప్రజలు చెబుతున్నారు. నెలలో కేవలం మూడు నుంచి నాలుగు రోజుల పాటు మాత్రమే రేషన్ పంపిణీ జరుగుతుండటంతో సారంగపల్లి, తుర్కపల్లి, దుబ్బపల్లి, శంకర్పల్లి, సండ్రన్‌పల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా ఈ నెల 23వ తేదీ వరకు రేషన్ బియ్యం అందకపోవడంతో అనేక కుటుంబాలు నష్టపోయాయి. రేషన్ బియ్యంపై ఆధారపడి జీవించే పేద కుటుంబాలకు ఇది తీవ్ర ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రేషన్ డీలర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని, ఆయన రేషన్ కోటాను రద్దు చేసి అర్హులైన స్థానికుడికి కేటాయించాలని గ్రామస్తులు మందమర్రి తహసీల్దార్‌ను కోరారు. ఐదు గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ధైర్యంతో దొంగతనాన్ని అడ్డుకున్న మహిళా కార్మికురాలు

### - మందమరి ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ ప్రశంసలు

**మందమర్రి, మార్చి 31, ప్రభాతవార్త**



సింగరేణి సంస్థ ఆస్తులను కాపాడటంలో అత్యంత అప్రమత్తత, నిజాయితీ ప్రదర్శించిన కేకే ఓపెన్ కాస్ట్ బేస్ వర్క్‌షాప్ జనరల్ అసిస్టెంట్ ఎం. శ్రీలతను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ బేస్ వర్క్‌షాప్‌లో మొదటి షిఫ్ట్‌లో విధుల్లో ఉన్న ఎం. శ్రీలత, వర్క్‌షాప్‌లోని విలువైన సామాగ్రిని అదే గనిలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి దొంగతనంగా తరలిస్తుండటం గమనించారు. ఏమాత్రం తడబడకుండా ఆమె సదరు వ్యక్తిని పట్టుకొని, వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆమె సమయస్ఫూర్తి వల్ల సంస్థ ఆస్తి చోరీకి గురికాకుండా నివారించబడింది.

**ప్రశంసా పత్రం ప్రదానం**

శ్రీలత ప్రదర్శించిన ధైర్యాన్ని, బాధ్యతాయుత ప్రవర్తనను గుర్తించిన ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ , మంగళవారం నాడు జి.ఎం. కార్యాలయంలో ఆమెకు ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సంస్థ పట్ల అంకితభావంతో పనిచేసే ఇలాంటి కార్మికులు అందరికీ ఆదర్శమని కొనియాడారు. విధుల్లో అప్రమత్తంగా ఉండి సంస్థ ఆస్తులను కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు సింగరేణి సేవా సమితి చేయూత

### - సేవా అధ్యక్షురాలు ఆశా

**జైపూర్, మార్చి 31, ప్రభాతవార్త**



మహిళా సాధికారతకు సింగరేణి సేవా సమితి చేయూతనిస్తుందని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఆశా అన్నారు. సేవా అధ్యక్షురాలు ఆశాతో పాటు ఈ.డి సతీమణి, శివ కుమారిలు ముఖ్య అతిథులుగా హాజరై ఎస్టీపిపి ద్వారా కంప్యూటర్ శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్టీపిపి పరిసర ప్రభావిత గ్రామ మహిళలకు, ఉద్యోగుల సతీమణులకు స్వయం ఉపాధి పొందుటకుగాను వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకొనుటకు ప్రతి సంవత్సరం సింగరేణి సేవా సమితి ద్వారా పలు వృత్తి విద్యా కోర్సులలో ఉచిత శిక్షణను అందజేసి పరీక్షలు నిర్వహించి వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. కంప్యూటర్ డి.టి.పి. కోర్సు నందు శిక్షణ పొందిన మహిళలకు సింగరేణి సేవా సమితి, ఎస్టీపిపి ఆధ్వర్యంలో మదర్ హ్యూమన్ యూత్ సొసైటి శిక్షణ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సింగరేణి సంస్థ, సింగరేణి సేవా సమితి ద్వారా ప్లాంటు ప్రభావిత గ్రామాల యువత, మహిళల కోసం అనేక రకాల ఉపాధి శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఇప్పటివరకు టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్ వంటి వివిధ శిక్షణా తరగతులను అందిచామని, మెజారిటీ యువత కోరిక మేరకు మొదటి సారి ఇక్కడ కంప్యూటర్ డి.టి.పి. శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కోర్సుకు మహిళల నుంచి విశేష స్పందన వచ్చిందని సుమారు 40 మంది మహిళలు శిక్షణ పొంది కోర్సు పూర్తిచేయడం చాలా ఆనందం కలిగిందని, మహిళలు ఇటువంటి ఉపాధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని తమ జీవితంలో మరింత పైకి ఎదగాలని ఆకాంక్షించారు. సర్టిఫికెట్లు పొందిన మహిళలకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన పలువురు మహిళలు మాట్లాడుతూ ఈ కోర్సు ద్వారా తాము కంప్యుటర్‌లో తెలుగు టైపింగ్, ఫోటోషాప్ వంటి సాంకేతిక అంశాలలో మెళకువలు నేర్చుకున్నామని సర్టిఫికెట్ ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా ఉంటుందని ఇటువంటి కోర్సును ఉచితంగా అందించినటువంటి ఎస్టీపిపి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్టీపిపి ఈడి సిహెచ్. చిరంజీవి, ఏఐటియుసి పిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ పంతులా సతీమణి నిలిమా పంతులా, డీజీఎం కిరణ్ బాబు, డాక్టర్ బి. జానకి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్, సీనియర్ అసిస్టెంట్ అరుణ, కంప్యూటర్ శిక్షకులు రాజ్ కుమార్, ఇతర అధికారులు, ఉద్యోగులు, మహిళలు సిబ్బంది పాల్గొన్నారు.

## తిర్యాని జడ్పి పాఠశాల పిడి సాంబశివరావుకు ఘనంగా వీడ్కోలు

**తిర్యాని, మార్చి 31, ప్రభాతవార్త:**



తిర్యాని జడ్పి పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా సేవలందించిన పి సాంబశివరావు పదవీ విరమణ పొందిన సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాజరై సాంబశివరావు గారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కె అంజయ్య మాట్లాడుతూ సాంబశివరావు సేవా కాలంలో క్రీడా రంగంలో విద్యార్థులను ప్రోత్సహిస్తూ అనేక మందిని జిల్లా, రాష్ట్ర స్థాయిలకు తీసుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు. సాంబశివరావు క్రమశిక్షణ, అంకితభావం, విద్యార్థుల పట్ల ప్రేమ ఆదర్శప్రాయమని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు కూడా తమ గురువైన సాంబశివ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ, పాఠశాలలో పనిచేసిన కాలం తన జీవితంలో మధురమైనదిగా నిలిచిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.